సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం । 5 । మే । 2025



హాయిగా నవ్వుదాం..

సిరిసిల్లటౌన్: ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల మానేరునదిలో ఆదివారం యోగా సాధకులు కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఆటపాటలతో ఫన్‌క్లబ్ నిర్వహించారు.



రోడ్డు నిర్మించండి

కోనరావుపేట(వేములవాడ): మామిడిపల్లి నుంచి చందుర్తి మండలం ఎన్గల్ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు.

గరిష్టం/కనిష్టం
37.0/25.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

భగీరథ మహర్షికి నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

సిరిసిల్ల: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నివాళి అర్పించారు. కలెక్టరేట్‌లో ఆదివారం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి జరిగింది. మహర్షి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేశారు. బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రాజమనోహర్‌రావు, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునరావు పాల్గొన్నారు.

బలోపేతమవుతున్న ప్రభుత్వ బడులు

- మానకొండూరు ఎమ్మెల్యే సత్యనారాయణ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతున్నాయని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని పెద్దలింగాపూర్‌లోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ గదుల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం గాలిపల్లిలో ఉపాధి హామీ కింద రూ.20లక్షలతో చేపట్టే సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు గుర్రం సందీప్‌రెడ్డి, డీఈ సత్యనారా యణ, ఏఈ నాగరాజు, ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, నాయకులు వెంకటరమణారెడ్డి, పాశం రాజేందర్‌రెడ్డి, కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

అబద్ధాలతో మోసం చేయలేరు

- కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్



మాట్లాడుతున్న ప్రకాశ్

సిరిసిల్లటౌన్: అబద్ధాలతో ప్రజల మనస్సులను బీజేపీ నేతలు గెలువలేరని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్ విమర్శించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రతీ మండలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 85,485 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కానీ బీజేపీ నేతలు అబద్ధపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్, బీజేపీలు దొందూ దొందేనని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న మంచి పథకాలపై అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ఆడెపు చంద్రకళ, కల్లూరి చందన, నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, గడ్డం కిరణ్, అన్నల్‌దాస్ భాను, వంతడ్పుల రాము, అడ్డగట్ల శంకర్, మేకర్తి నారాయణ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి



రామచంద్రారెడ్డికి స్వాగతం పలుకుతున్న బీజేపీ జిల్లా నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత బీజేపీ కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. ముస్తాబాద్ మండలం బందనకల్‌లో ఆదివారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం దేశాన్ని ప్రపంచంలోనే అగ్రరాజ్యంగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారు. దేశభద్రత, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందని పేర్కొన్నారు. పదకొండేళ్లుగా అత్యంత సురక్షిత దేశంగా భారత్ ఎదిగిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, మండల అధ్యక్షుడు సొల్ల క్రాంతి, నాయకులు కస్తూరి మహిపాల్ రెడ్డి, కరెడ్ల రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, కల్యాణ్, మహేశ్, కార్తీక్‌రెడ్డి, శ్రీకర్‌రెడ్డి, గోపి తదితరులు ఉన్నారు.

అడవిని చూసొద్దాం

- సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో పిల్లల సందడి
- వేసవిలో సందర్శనీయ ప్రాంతం
- అడవిపై అవగాహన.. జంతువుల సందర్శన
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



అర్బన్ ఫారెస్ట్ వంతెనపై విద్యార్థులు



సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్ పార్క్‌లో విద్యార్థులతో అటవీశాఖ అధికారులు

సిరిసిల్ల: విద్యార్థులకు అడవిని పరిచయం చేయడం.. ఫారెస్ట్ ద్వారా కలిగే లాభాలు వివరించడం.. జంతువులను చూడడం.. వీటన్నింటికీ సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్ పార్క్ వేదికగా నిలుస్తోంది. 125 ఎకరాల్లో రూ.6కోట్ల ప్రతిపాదనలతో పనులు ప్రారంభించగా.. సుమారు రూ.2కోట్లతో చేశారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ శివారులో కరీంనగర్-కామారెడ్డి ప్రధాన రహదారిని ఆనుకుని ఫారెస్ట్ పార్క్ ముఖద్వారం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి అర కిలోమీటరు అడవిలోకి వెళ్లగానే.. పిల్లలకు ఆట వస్తువులు, చెరువులో వంతెన.. ఊయలలు, నీటి కొలనులను ఏర్పాటు చేశారు. వేసవి కావడంతో ఎండిన అడవి కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేత కోసం వచ్చే వన్యప్రాణులను దూరం నుంచే చూడవచ్చు.

ఫారెస్ట్‌లో పిల్లల సందడి

అర్బన్ ఫారెస్ట్‌పార్క్‌లో ఇటీవల సిరిసిల్లలోని ఓ ప్రైవేటు పాఠశాల పిల్లలు సందడి చేశారు. పార్క్‌ను సందర్శించి అడవి అందాలను ఆస్వాదించారు. అడవిలోని వివిధ రకాల చెట్లు, వన్యప్రాణులు, వాటి లక్షణాలు తెలుసుకున్నారు. సిరిసిల్ల ఫారెస్ట్ అధికారులు వన్యప్రాణులు, అడవి వాటి ప్రాముఖ్యతను పిల్లలకు అర్థమయ్యేలా వివరించారు. వర్షాకాలంలో పచ్చగా ఉండే అటవీ అందాలు మరింత కనువిందు చేస్తాయి. ఇప్పుడు ఆకులు ఎండి, నీరు అడుగంటి బోసిపోయి ఉంది. అయినా పిల్లలను ఆకర్షిస్తోంది.

చాలా బాగుంది



నేను అడవిని టీవీల్లో, సినిమాల్లో చూశాను. ఫారెస్ట్‌కు వెళ్లి చూడడం ఇదే మొదటిసారి. చాలా బాగుంది. వంతెనపై తిరిగాము, స్నేహితులతో కలిసి ఆడుకున్నాం. ఫొటోలు దిగాం. చెట్లు, రాళ్లు, ఆట వస్తువులు ఉన్నాయి. అడవిలో తిరుగుతూ.. ఎంతో సంతోషించాం.

– మెహెర్ సుకృత, విద్యార్థిని, సిరిసిల్ల

అడవి గురించి వివరించారు



మా పిల్లలు, మేము అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు వెళ్లాం. పిల్లలు బాగా ఎంజాయ్ చేశారు. అడవి గురించి పిల్లలు పుస్తకాల్లో చదువుకోవడమే తప్ప ప్రత్యక్షంగా చూసింది లేదు. పిల్లలందరూ ఫారెస్ట్‌లోకి రావడంతో సంతోషపడ్డారు. అడవి ప్రాధాన్యత గురించి, అటవీశాఖ అధికారులు వివరించారు. అనేక కొత్త విషయాలు తెలిశాయి.

– అశోక్, వ్యాయామ ఉపాధ్యాయుడు, సిరిసిల్ల

ఇటీవల ప్రారంభించాం



సిరిసిల్ల అర్బన్ ఫారెస్ట్ పార్క్‌ను ఇటీవల ప్రారంభించాం. పట్టణ వాసులకు ఆహ్లాదం పంచేందుకు ఈ పార్క్‌ను మున్సిపల్, అటవీశాఖ సంయుక్తంగా నిర్మించింది. ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని వసతులు కల్పించాల్సి ఉంది. విద్యార్థులకు అడవిపై అవగాహన కల్పించేందుకు పార్క్ ఉపకరిస్తుంది.

– వి.శ్రీహరిప్రసాద్, ఎఫ్ఆర్‌వో, సిరిసిల్ల

రైతుల సంక్షేమమే లక్ష్యం



కుడికాల్వ ద్వారా ప్రవహిస్తున్న నీటిని పరిశీలిస్తున్న విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ నుంచి నీటి విడుదల

కోనరావుపేట(వేములవాడ): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మల్కపేటలోని మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ ద్వారా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆదివారం నీటిని విడుదల చేశారు. సభలో మాట్లాడుతూ మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ ద్వారా కోనరావుపేట మండలం మలకపేట, కనగర్తి, నాగారం, పల్లిమక్త, సుద్దాల, రామన్నపేట, మంగళపల్లి, వేములవాడ మండలం మారుపాక వరకు నీటిని విడుదల చేసినట్లు వివరించారు. ఇదివరకు మెయిన్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసి అక్కపల్లి, బుగ్గరాజేశ్వరతండా, అల్మాస్‌పూర్, రాజన్నపేట, దేవునిగుట్టతండా, గొల్లపల్లి బాకూరుపల్లి, తిమ్మాపూర్ వరకు నీటిని విడుదల చేశామన్నారు. సుమారు 5వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేసినట్లు గుర్తుచేశారు. సిరిసిల్ల, వేములవాడ, కోనరావుపేట మండలాల్లోని 25,694 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందని తెలిపారు. ఎడమకాలువ కోసం ఇప్పటి వరకు 70 ఎకరాలు సేకరించామని, మరో 70 ఎకరాలు భూసేకరించనున్నట్లు ప్రకటించారు.

ధర్మారంలో 4 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం

మహిళలను కోటీశ్వరులు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో 4 మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రం మంజూరు చేసిన విషయాన్ని తెలిపారు. ఇప్పటికే రూ.30లక్షలతో ఎలక్ట్రిక్ బస్సు మంజూరు చేశామన్నారు. మహిళలు ముందుకొస్తే మండలానికో రైస్‌మిల్లును మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మల్కపేటలో మాజీ మంత్రి చల్మెడ ఆనందరావు కుటుంబీకులు నిర్మించిన రామాలయాన్ని ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నీటిపారుదలశాఖ అధికారి అమరేందర్‌రెడ్డి, ఈఈ కిశోర్, డీఈలు సత్యనారాయణ, వినోద్, శ్రీనివాస్, డీఆర్‌డీవో శేషాద్రి, ఏఎంసీ చైర్మన్ ఎల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రభాకర్, డైరెక్టర్లు, ఏఈలు సురేశ్, శ్రీశైలం, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా పాల్గొన్నారు.

ఏళ్లుగా ఎదురుచూశాం



మల్కపేట ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తి చేస్తారోనని ఎదురుచూస్తున్నాం. ఆదివారం కుడి కాల్వ ద్వారా కోనరావుపేట మండలం ధర్మారంలోని సుమారు 988 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడింది.

– జగిడి బాపురెడ్డి, ధర్మారం

రైతులకు ప్రయోజనం



మల్కపేట రిజర్వాయర్‌తో ఈ ప్రాంతంలోని రైతులకు ప్రయోజనం. మా పల్లిమక్తలోని 1,113 ఎకరాలకు సాగునీరు అందుతుంది.

– ఎనగంటి నాగేంద్రబాబు, పల్లిమక్త

దేవయ్యకు గద్దర్ ఐకాన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఆకునూరి దేవయ్య

సిరిసిల్లకల్చరల్: జిల్లా కేంద్రానికి చెందిన జానపద గాయకుడు ఆకునూరి దేవయ్యకు సాయి అలేఖ్య సాంస్కృతిక సేవాసంస్థ గద్దర్ ఐకాన్ అవార్డును ప్రదానం చేసింది. రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ సౌజన్యంతో హైదరాబాద్ బిర్లా సైన్స్ సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా శనివారం రాత్రి ఈ పురస్కారం అందుకున్నారు. ప్రభుత్వ సలహాదారు సముద్రాల వేణుగోపాలాచారి, రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ గద్దర్ వెన్నెల, అలేఖ్య సంస్థ చైర్మన్ ఉపద్రష్ట అరుణఅశోక్, ఉప్పుల శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ సిట్టింగ్





సిరిసిల్ల శివారులో మద్యం తాగుతున్న మందుబాబులు, రాజీవ్‌నగర్ శివారులో..

- జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం
- గ్రామ శివారులు, వాగులే అడ్డాలు
- దాడులు చేస్తున్నా ఆగని మందుబాబులు



పెద్దూరు శివారులో బహిరంగ మద్యపానం

సిరిసిల్ల: జిల్లాలో మందుబాబులు బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, చంద్రంపేట, రెండోబైపాస్ రోడ్డు ప్రాంతాలు సాయంత్రం అయితే చాలు మందుబాబులతో హడావుడిగా మారిపోతున్నాయి. వ్యవసాయ పనులు ముగించుకొని ఇంటిబాట పట్టిన మహిళలు మందుబాబుల కనిపిస్తుండడంతో భయాందోళన చెందుతున్నారు. మరికొందరైతే ఎక్కడ చీకటి ఉంటుందో అక్కడే మందు బాటిళ్లతో సిట్టింగ్ పెడుతున్నారు. ప్రధానంగా కార్మిక క్షేత్రం సిరిసిల్ల పట్టణం శివారు కాలనీలో ఈ పరిస్థితులు ఉన్నాయి. చంద్రంపేట బస్టాండ్‌కు సమీపంలోనే ఓ బెల్ట్‌షాపులో ఓపెన్‌గానే మద్యం సిట్టింగ్‌లు పెడుతున్నారు. పెద్దూరు శివారులో పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి.

గ్రామాల్లో బెల్ట్‌జోరు


మండల కేంద్రాల్లో వైన్‌షాపులకు అనుబంధంగా సిట్టింగ్ రూమ్స్ ఉండగా.. గ్రామాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుల్లోనూ బార్లను తలపించేలా సిట్టింగ్‌లు ఉంటున్నాయి. గ్రామాల్లోని బెల్టుషాపుల నిర్వాహకులు ఎక్కువ మందు విక్రయించుకునేందుకు మందుబాబుల కోసం టేబుళ్లు, కుర్చీలు, కూలర్లు సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గ్రామంలో ఐదు నుంచి పది వరకు అనధికారిక బెల్టుషాపులు ఉన్నాయి. ప్రతీ షాపులో రోజుకు తక్కువకు తక్కువగా రూ.10వేల వరకు మందు విక్రయిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో అనధికారికంగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారు. ముస్తాబాద్ మండలం ఆవునూర్, కొండాపూర్ గ్రామాల్లో అయితే అర్ధరాత్రి సైతం బెల్టుషాపుల్లో మందుబాబులు కనిపిస్తున్నారు. గంభీరావుపేట మండల కేంద్రంలోని చెరువుకట్టలే అడ్డాలుగా మందుబాబులు బహిరంగంగానే మద్యం తాగుతున్నారు. పోలీసులు బహిరంగంగా మద్యం తాగుతున్న వారిపై కేసులు నమోదు చేస్తున్నా మందుబాబులు మారడం లేదు.

స్వర్ణకారుల దీక్షలకు సంఘీభావం



ముస్తాబాద్(సిరిసిల్ల): మండలకేంద్రంలో స్వర్ణకారులు చేపట్టిన దీక్షకు నల్లగొండ, కామారెడ్డి జిల్లాల స్వర్ణకారుల సంఘం బాధ్యులు ఆదివారం సంఘీభావం తెలిపారు. ఇతర రాష్ట్రాల జువెల్లరీ దుకాణాలకు అనుమతులు ఇవ్వడంతో స్థానికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఇతర రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడి ప్రజలను మోసం చేసిన ఘటనలు ఎన్నో ఉన్నాయన్నారు. మండల నాయకులు చింతోజు బాలయ్య, వెంకటేశ్, అనిల్, బ్రహ్మం, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

‘ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఆత్మహత్యలు’



వితల్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న నేతలు

సిరిసిల్లటౌన్: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సిరిసిల్లలో నేతన్నల బలవన్మరణాలు జరుగుతున్నాయని పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కోడం రమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం సుందరయ్యనగర్‌కు చెందిన పవర్‌లూమ్ అనుబంధ కార్మికుడు బత్తుల వితల్ మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి మాట్లాడారు. నేత కార్మికులకు ఉపాధి కల్పించి, ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతుంటే.. అధికారుల అలసత్వంతో కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. నిరంతరం ఉపాధి, మెరుగైన కూలీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన చీరల తయారీ ఆర్డర్‌కు కార్మికుల కూలి నిర్ణయించాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో ఇప్పటికే దాదాపు 16 మంది నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారని, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. నేత కార్మికులకు కూలి నిర్ణయించాలని, పవర్‌లూమ్ కార్మికులకు రావాల్సిన 2023 సంవత్సరం 10 శాతం యారన్ సబ్సిడీ అందించాలని, వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిరిమల్ల సత్యం, బాస శ్రీధర్ పాల్గొన్నారు.

పరీక్షలపై ప్రతిష్టంభన

- డిగ్రీ విద్యార్థుల్లో ఆందోళన
- పరీక్షలపై కాలేజీ యాజమాన్యాల సహాయ నిరాకరణ
- గడువు ముగిసినా పరీక్ష ఫీజులు చెల్లించని వైనం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరు చేయాలని విన్నపం

ప్రైవేట్ కాలేజీలు : 62
విద్యార్థులు : 50 వేలు (దాదాపు)



వీసీ ఓఎస్‌డీ హరికాంత్‌కు వినతిపత్రం అందిస్తున్న సుప్మా ప్రతినిధులు (ఫైల్)

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లిస్తేనే పరీక్షల నిర్వహణకు ముందుకొస్తామని డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు.. ముందుగా పరీక్ష ఫీజు చెల్లించండి అని యూనివర్సిటీ అధికారుల ప్రతిపాదనల మధ్య అసలు పరీక్షల నిర్వహణపై సందిగ్ధత నెలకొంది. ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ పరీక్షలు పూర్తికాగా.. శాతవాహన పరిధిలో డిగ్రీ పరీక్షలపై ప్రతిష్టంభన నెలకొంది. డిగ్రీ చివరి సెమిస్టర్ విద్యార్థులు మాత్రం తాము పోటీపరీక్షలకు అనర్హులమవుతామని.. పరీక్షలు నిర్వహించాలని కోరుతున్నారు.

ఏడాదిగా సాగుతున్న ఫీజు పోరు

గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో మూడున్నరేళ్లుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాలేదు. కళాశాలల నిర్వహణకు ప్రైవేట్ యాజమాన్యాలు అప్పు చేయాల్సిన పరిస్థితులు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదల్లో జాప్యంతో అధ్యాపకులకు వేతనాలు, భవనాలకు అద్దెలు, ఇతర నిర్వహణ ఖర్చులకు డబ్బులు లేక ప్రైవేట్ కాలేజీలు చేతులెత్తేస్తున్నాయి. ప్రభుత్వ పెద్దలు, మంత్రులకు ఎన్నో సార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. గత్యంతరం లేని స్థితిలో సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సహాయ నిరాకరణకు దిగాయి. విద్యార్థులు పరీక్ష ఫీజు చెల్లించినా యాజమాన్యాలు యూనివర్సిటీకి మాత్రం చెల్లించలేదు. ఈమేరకు శాతవాహన వర్సిటీ ఉన్నతాధికారులకు ప్రైవేట్ కళాశాలల యాజమాన్య సంఘం ప్రతినిధులు లేఖలు అందించారు.

మే 14 నుంచి పరీక్షలు

ప్రభుత్వం దిగివచ్చి బకాయిలు విడుదల చేస్తేనే ఫీజులు చెల్లిస్తామని, అప్పటి వరకు పరీక్షల నిర్వహణకు సహకరించేది లేదని శాతవాహన ప్రైవేట్ డిగ్రీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(సుప్మా) నిర్ణయించింది. వైస్‌చాన్స్‌లర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుందామని భావించినా పరీక్ష ఫీజు చెల్లిస్తేనే చర్చలకు అవకాశం ఉంటుందని వీసీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో పరీక్షల నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. రెండు, మూడు రోజుల్లో స్పష్టత వస్తే తప్ప విద్యార్థుల ఆందోళనకు తెరపడే అవకాశం లేదు. కాగా కొత్త విద్యా సంవత్సరంలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించిన దోస్త్ ప్రకటన విడుదల కావడం విశేషం.

గత్యంతరం లేని పరిస్థితిలోనే..



పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్న ప్రైవేట్ కళాశాలలపై ప్రభుత్వాలకు చిన్న చూపు. రేపటి తరాన్ని రూపొందించే విద్యావ్యవస్థల బకాయిల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా లేకపోవడం విచారకరం. అప్పులు, వడ్డీలు పెరిగిపోయి నిర్వాహకులు నిరాశ, నిస్పృహలో కూరుకుపోయారు. ఫీజులు విడుదలైతే కానీ పరీక్షలు జరగనివ్వం.

– శ్రీపాద నరేశ్, సుప్మా, కార్యదర్శి

క్లుప్తంగా

విషపురుగు కాటుకు వ్యక్తి మృతి

సారంగాపూర్(జగిత్యాల): రోళ్ళవాగు ప్రాజెక్టు వద్ద ఎండ్రికాయలు పడుతుండగా పాము కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. బీర్‌పూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నందగావ్ గ్రామానికి చెందిన గణపతిదేవ్‌రావు టార్పే (34) తన స్నేహితుడు సూర్యభాను మారుతితో కలిసి శనివారం ఎండ్రికాయలు పట్టేందుకు బీర్‌పూర్ శివారులోని రోళ్ళవాగు ప్రాజెక్టు వద్దకు వెళ్లారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఎండ్రికాయలు పడుతున్న క్రమంలో చీకటిగా ఉండడంతో విషపురుగు కాటువేసింది. వెంటనే సూర్యభాను మారుతి 100కు డయల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకుని గణపతిదేవ్‌రావు టార్పేను 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. మృతుడి భార్య పుష్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా నిర్మల్ జిల్లా సరిహద్దుల్లోని మహారాష్ట్ర ప్రాంతానికి చెందినవారు జీవనోపాధి కోసం ఇక్కడి వచ్చి ఎండ్రికాయలు పట్టుకుని వెళ్తుంటారని పోలీసులు తెలిపారు.

కోతుల దాడిలో మహిళకు గాయాలు

హుజూరాబాద్: కోతుల దాడిలో ఆదివారం మహిళ తీవ్రంగా గాయపడింది. స్థానికుల వివరాలు.. పట్టణంలోని విద్యానగర్ మూడో రోడ్‌లో కోతుల మంద భారీ సంఖ్యలో తిరుగుతూ పుల్లూరి త్రివేణిని తీవ్రంగా గాయపరిచాయి. కోతులతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను మున్సిపల్ అధికారులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

శివలింగం, నంది విగ్రహం లభ్యం



శివలింగం, నందివిగ్రహం

చొప్పదండి: మండలంలోని దేశాయిపేట గ్రామ చెరువు వద్ద ఆదివారం నంది, శివలింగం విగ్రహాలు లభ్యమయ్యాయి. విషయం తెలిసిన గ్రామస్తులు విగ్రహాల వద్ద కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్నారు. విగ్రహాలు లభ్యమైన చోటనే శివాలయం నిర్మించాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేయగా పూజారులను సంప్రదించి నిర్ణయం తీసుకోవాలని మరి కొందరు అన్నారు. ఆలయ నిర్మాణానికి వేరే స్థలం తీసుకొని విగ్రహాలు ప్రతిష్ఠించాలని గ్రామంలోని నాయకులు పేర్కొన్నారు.

డబ్బులతో ఉడాయించిన వ్యాపారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారులుగా స్థిరపడ్డ రాజస్థాన్‌కు చెందిన ఇద్దరు అందినకాడికి అప్పు చేసి రూ.50లక్షలతో రాత్రికిరాత్రే ఉడాయించారు. విషయం తెలుసుకున్న రుణదాతలు లబోదిబోమంటున్నారు. బాధితులు ఆదివారం పోలీసులను ఆశ్రయించారు. వివరాలు.. రాజస్థాన్‌లోని నాగుల్‌కు చెందిన గుమాన్ రాచర్ల గొల్లపల్లిలో బట్టల వ్యాపారిగా స్థిరపడ్డాడు. మరొకరితో కలిసి వ్యాపారం కోసమని స్థానికుల నుంచి రూ.లక్షల్లో అప్పు చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా పలు చిట్టీలను ఎత్తుకున్నారు. ఇద్దరు కలిసి సుమారు రూ.50లక్షలకు పైగా అప్పులు చేసి గుట్టుచప్పుడు ఉడాయించారు. మూడు రోజుల క్రితమే వారు గ్రామాన్ని విడిచి పరారీ కాగా.. విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో అప్పులు ఇచ్చిన వారు తల పట్టుకుంటున్నారు. బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో పరారీ అయిన వ్యాపారుల కోసం గాలిస్తున్నారు. అప్పులిచ్చిన వారి వివరాలు సేకరిస్తున్నారు.

‘ఎన్‌రైప్’తో మామిడి ‘పండు’

- కాయలను పండుగా మార్చే పౌడర్
- మామిడి మార్కెట్లో చైనా పౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం
- కాల్షియం కార్బైడ్‌ను నిషేధించిన ప్రభుత్వం
- ఎన్‌రైప్ పౌడర్ విక్రయాలకు సర్కార్ అనుమతి



ఆగ్రోస్ కేంద్రాల్లో విక్రయించే ‘ఎన్‌రైప్’ ప్యాకెట్లు



మామిడి అట్టపెట్టెలో పండుగా మార్చే నిషేధిత కాల్షియం కార్బైడ్ ప్యాకెట్లు

జగిత్యాలఅగ్రికల్చర్: మామిడికాయలను పండుగా మార్చేందుకు చాలా చోట్ల వ్యాపారులు విషపూరితమైన కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్‌లను వాడుతున్నారు. ఇటీవల జగిత్యాల (చల్‌గల్) మామిడి మార్కెట్ నుంచి ఇతర రాష్ట్రాలకు తరలించే కాయల్లో కాల్షియం కార్బైడ్ కలిగిన చైనాపౌడర్లు వాడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాంటి పండ్లను తింటున్న వినియోగదారులు క్యాన్సర్ బారిన పడుతుండడంతో ఆరోగ్య సంస్థ, హైకోర్టు కాయను పండుగా మార్చే రసాయనాలను నిషేధించింది. దీంతో కాయను పండుగా మార్చేందుకు ఎన్‌రైప్ అనే సేంద్రియ పౌడర్‌ను ఉపయోగిస్తున్నారు. ఎన్‌రైప్‌ను ఉపయోగించాలని ఉద్యాన శాఖ ప్రచారం చేస్తుండగా, ఆగ్రోస్ సంస్థ ఆ పౌడర్‌ను మార్కెటింగ్ చేస్తుంది.

పండ్లలో రారాజు..

పండ్లలో రారాజు మామిడిలో అన్ని రకాల పోషకాలు ఉండడంతో ప్రతి ఒక్కరూ తినేందుకు ఇష్టపడుతుంటారు. గతంలో పక్వానికి వచ్చిన కాయలను గడ్డి, మామిడి ఆకు కింద మాగబెట్టేవారు. అప్పుడు మామిడిపండ్లు రుచిగా, నాణ్యతగా ఉండేవి. కాగా, మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి వ్యాపారులు రసాయనాలతో పండుగా మార్చడం మొదలుపెట్టారు. దీంతో మామిడి పండుతో లాభం కంటే నష్టం ఎక్కువగా జరగడంతో ప్రభుత్వం రసాయనాలను నిషేధించింది.

అట్టపెట్టెల్లో చైనా ప్యాకెట్లు

చల్‌గల్ మామిడి మార్కెట్ నుంచి పంజాబ్, హరియాణా, ఢిల్లీ వంటి రాష్ట్రాలకు ఎక్కువగా మామిడికాయలు ఎగుమతి చేస్తారు. జగిత్యాల నుంచి ఢిల్లీ వెళ్లాలంటే లారీకి రెండురోజులు పడుతోంది. సదరు కాయలను అక్కడి వ్యాపారులు పండుగా మార్చాలంటే మరో నాలుగైదు రోజులు పడుతోంది. దీంతో వ్యాపారులు త్వరగా మార్కెటింగ్ చేసుకోవాలనే ఉద్దేశంతో ఆయా రాష్ట్రాలకు పంపే మామిడికాయల అట్టపెట్టెల్లో చైనాపొడి ప్యాకెట్లను విచ్చలవిడిగా వాడుతున్నారు. కాయను పండుగా మార్చే పౌడర్లను ప్రభుత్వం నిషేధించింది. దీనికి తోడు, చాలా మంది పక్వానికి రాని కాయలను విక్రయిస్తుండడంతో వాటిని కొనుగోలు చేసిన వ్యాపారులు, ఢిల్లీ వెళ్లేవరకు కాయ నాణ్యత చెడిపోతుండడంతో వాటికి సైతం పౌడర్లు వాడుతున్నారు.

ఎన్‌రైప్‌కు ప్రభుత్వ అనుమతి

సహజ సిద్ధమైన స్టార్చ్(గంజి)లో ఉండే ఇథలిన్, మాడ్చిన కొబ్బరిచిప్పల పొడితో ‘ఎన్‌రైప్’ పౌడర్‌ను తయారు చేస్తారు. ఈ పౌడర్‌తో కాయ పండుగా మారినా రుచి, నాణ్యతలో తేడా ఉండదు. ఈ మేరకు బెంగళూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రిసెర్చ్ సంస్థ ఆమోద ముద్ర వేయగా, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతి ఇవ్వగా, తెలంగాణలో ఎన్‌రైప్‌ను అమ్మేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

పండుగా ఎలా మార్చుతుందంటే..

ఎన్‌రైప్ ప్యాకెట్ రూ.పదికి మార్కెట్లో దొరుకుతోంది. ఒక ప్యాకెట్ ద్వారా 10–15 కిలోల మామిడి కాయలను పండుగా మార్చవచ్చు. పక్వానికి వచ్చిన కాయలను అట్టపెట్టెలో పెట్టి అందులో నాలుగైదు చోట్ల చిన్నరంధ్రాలు చేసిన ఎన్‌రైప్ ప్యాకెట్‌ను వేసి గాలి తగలకుండా సీల్ చేయాలి. ఎన్‌రైప్ ద్వారా నాలుగైదు రోజుల పాటు అవసరమైన ఇథలిన్ గ్యాస్ విడుదలై కాయ పండుగా మార్చుతుంది.

తనిఖీలు నిర్వహించాలి



మామిడి మార్కెట్‌తో పాటు రోడ్డు వెంట ఉన్న షెడ్లు, మామిడి విక్రయాలు చేసే దుకాణాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించాలి. కాల్షియం కార్బైడ్, చైనాపౌడర్లు వాడటంపై స్పష్టమైన నిబంధనలు పాటించాలి. ఆరోగ్యం కోసం తినే మామిడిపండు మనిషి అనారోగ్యానికి గురయ్యేలా తయారయితే ఏం లాభం.

– సత్యనారాయణరెడ్డి, ధర్మపురి

ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్..



ప్రభుత్వ అనుమతితోనే ఎన్‌రైప్ విక్రయాలు జరుగుతున్నాయి. అగ్రోస్ సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మామిడికాయను ఎన్‌రైప్‌తో పండుగా మార్చవచ్చు. ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావు. కాల్షియం కార్బైడ్, చైనాపొడిని ప్రభుత్వం నిషేధించింది.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి, జగిత్యాల

పవర్ లిఫ్టర్లు

- పతకాల సాధనలో క్రీడాకారిణులు
- ఉత్తరాఖాండ్‌లో అంతర్జాతీల పోటీలు
- నేటి నుంచి ఈనెల 12 వరకు నిర్వహణ
- రాష్ట్ర వ్యాప్తంగా 15 మందిలో నలుగురు ధర్మపురి వాసులే



పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఐశ్వర్య (ఫైల్)

ధర్మపురి: చదువుతో పాటు పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చాటుతున్నారు. పేద కుటుంబాలకు చెందిన స్వప్నిక, ఎస్.ఐశ్వర్య, కుమ్మరి పూజిత, భూక్య శ్రావణి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం నుంచి ఈనెల 12 వరకు ఉత్తరాఖాండ్‌లో జూనియర్, సబ్ జూనియర్ విభాగాల్లో జరిగే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటారు. ఈ పోటీలకు తెలంగాణ నుంచి మొత్తం 15 మంది ఎంపిక కాగా, వారిలో జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన నలుగురు ఎంపికయ్యారు. వీరంతా మండలంలోని మగ్గిడి మోడల్ కళాశాలలో చదివారు. ప్రస్తుతం ఇద్దరు కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్నారు. ఐశ్వర్య, భూక్య శ్రావణికి ఫేస్‌బుక్ మిత్రులు (ఎన్నారైలు) రూ.1.16 లక్షలు, కుమ్మరి పూజితకు వీరా జిమ్ నిర్వాహకుడు నరేశ్ రూ.12 వేలు ఆర్థికసాయం అందించారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



అమ్మానాన్న కవిత, రాజయ్య వ్యవసాయ కూలీలు. మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ చదువుతున్న. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఉన్నత స్థాయికి చేరుకుంటా.

– పూజిత, కమలాపూర్, ధర్మపురి

పతకం సాధిస్తా



మాది మండలంలోని నక్కలపేట. అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని రైల్వే ఉద్యోగం చేయడం లక్ష్యం. మగ్గిడి మోడల్ స్కూల్ పీఈటీ రాజేందర్ శిక్షణలో ఈ స్థాయికి ఎదిగిన. తప్పకుండా పతకంతో వస్తా.

– భూక్య శ్రావణి, నక్కలపేట, ధర్మపురి

మనిషికి చిటికెడంతా ప్రేమ అవసరం

- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్



పురస్కారాలు ప్రదానం చేస్తున్న నలిమెల భాస్కర్, కవులు

కరీంనగర్‌కల్చరల్: కూడు, గూడు, బట్టలాగే ప్రేమ కూడా మనిషికి కనీస అవసరమేనని, కవిత్వ పతనంతో మనిషికి చిటికెడంతా ప్రేమైనా అందాలని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నలిమెల భాస్కర్ అన్నారు. ఆదివారం తెలంగాణ రచయితల వేదిక, ఉమ్మడిశెట్టి లిటరరీ ట్రస్టు నిర్వహణలో సాహిత్య పురస్కారాల సభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు రాధేయ మాట్లాడుతూ, కవిత్వాన్ని ప్రేమించే తాను సృజనకారులను ప్రోత్సహించడానికి 37 ఏళ్లుగా పురస్కారాలను అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విజయవాడకు చెందిన వైష్ణవశ్రీకి సత్యదేవి సాహిత్య పురస్కారం, వరంగల్ కవి నందకిషోర్‌కు ఉమ్మడిశెట్టి సతీశ్‌కుమార్ యువ పురస్కారం, తిరుపతికి చెందిన సుధామురళికి రాజయ్య కవితా పురస్కారాన్ని నలిమెల చేతులమీదుగా ప్రదానం చేశారు. అలాగే కరీంనగర్‌కు చెందిన యుగంధర్ కవితా సంపుటి ‘ఇదేమి యుద్ధం’ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కవులు అన్నవరం దేవేందర్, సీవీ కుమార్, కందుకూరు అంజయ్య, గాజోజు నాగభూషణం, నడిమెట్ల రామయ్య, విలాసాగరం రవీందర్, తోట నిర్మల రాణి, పెనుగొండ సరసిజ, రామానుజం సుజాత, నీలగిరి అనిత, నసీరుద్దీన్, నెరువట్ల చైతన్య, కూకట్ల తిరుపతి, మోర అనిల్, పీఎస్ రవీంద్ర, బీవీఎం స్వామి, గుండు రమణయ్య, గాజుల రవీందర్, ప్రేమసాగర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చెలరేగిన మంటలు.. తప్పిన ప్రమాదం



రైస్‌మిల్‌కు సమీపంలో మంటలు

కథలాపూర్(వేములవాడ): మండలంలోని ఊట్‌పెల్లి గ్రామశివారులో శనివారం రాత్రి పిచ్చిమొక్కలకు నిప్పంటుకొని మంటలు చెలరేగడంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. పిచ్చిమొక్కలకు అంటుకున్న మంటలు వ్యాపించి గ్రామశివారులోని రైస్‌మిల్, పెట్రోల్ బంక్ సమీపం వరకు చేరుకున్నాయి. గ్రామస్తులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకొని మంటలార్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. ఎస్సై నవీన్‌కుమార్ తన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని ప్రజలను అప్రమత్తం చేశారు. మెట్‌పల్లి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలార్పేసింది. అగ్నిప్రమాదంలో రైస్‌మిల్, పెట్రోల్ బంక్‌కు ఎలాంటి నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.



ఈశ్వర.. పరమేశ్వర..

వేములవాడ: రాజన్నను ఆదివారం 35 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల ద్వారా రూ.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.





వేసవి దుక్కి.. పంటకు పుష్టి

- పంట కొయ్యలు కాల్చేస్తే ప్రమాదమే
- తొలకరికి ముందు లోతు దుక్కులు మేలు
- ఏటవాలుగా దున్నితే మరింత శ్రేయస్కరం



దుక్కి చేస్తున్న రైతు

కరీంనగర్ అర్బన్: శాస్త్రవేత్తల మాటలు కాకుండా సొంత నిర్ణయాలే పంటల దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. పంట కొయ్యలు కాల్చకుండా కలియదున్నడం, వేసవిలో లోతు దుక్కులతో ఎంతో ప్రయోజనం. పురుగులు, తెగుళ్ల, కలుపును నివారించుకోవడంతో పాటు భూమిపొరల్లో వర్షపునీరు ఇంకి పంటకు ఉపయోగపడుతుంది. వేసవిలో లోతు దుక్కుల ఉపయోగాల గూర్చి కరీంనగర్ వ్యవసాయ పరిశోధనస్థానం హెడ్ డీన్ డా.జి.మంజులత వివరించారు. వేసవి దుక్కులకు ఏప్రిల్, మే నెలలు అనుకూలం, వేసవి దుక్కులను అడ్డం, పాడువు సాళ్లతో కాకుండా ఏటవాలుగా దున్నడం శ్రేయస్కరం.

ఏటవాలు దుక్కితో ప్రయోజనాలనేకం

ఏటవాలుగా దున్నడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. లోతుగా దున్నినపుడు భూమిలోపలి పొరల్లో ఉన్న క్రిమికీటకాలు సూర్యకిరణాలతో చనిపోతాయి. వేసవి దుక్కుల్లో తొలకరి వర్షాలు కురిసినపడు విత్తనాలు వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. తొలకరి వర్షాలకు ముందే రెండుసార్లు దున్నితే గట్టిగా ఉన్న భూమి గుల్లబారడంతో పాటు కలుపు నివారించుకోవచ్చు. వర్షం నీరు భూమిలోకి చొచ్చుకొనిపోతోంది, భూమి పొరల్లోకి గాలి చేరుతుంది. సూక్ష్మజీవుల సాంద్రత, సేంద్రియ కర్బనం బాగా పెరుగుతుంది. దీంతో భూమిలోని పోషకాలను మొక్క గ్రహించడానికి అనుకూలంగా ఉంటుంది. కలుపు, పురుగు మందుల అవశేషాలకు మొక్కలు తీసుకోవు. భూమి వర్షపునీటిని తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది. గాలిలో ఉన్న నత్రజని వర్షపునీటితో కలిసి భూమిలోకి చేరడం వల్ల భూసారం పెరుగుతుంది. పురుగుమందులు, తెగుళ్ల మందులకయ్యే పెట్టుబడిని తగ్గించుకోవచ్చు. హానిచేసే బాక్టీరియాను నాశనం చేయొచ్చు.

వరికొయ్యలు కలియదున్నాలి

వరి కోతలు పూర్తయ్యాక కొయ్యలను తగులబెడుతుంటారు. దీనివల్ల భూమి సారం కోల్పోతుంది. అలా కాకుండా వరి కొయ్యలను నీటిలో నాన్చి దున్నడం లేదా బీడులోనే కలియదున్నితే నేలలో పోషక విలువలు పెరుగుతాయి. పత్తి రైతులు కాల్చివేయకుండా కలియదున్నాలని శాస్త్రవేత్తలు స్పష్టం సూచిస్తున్నారు. ప్రమాదాల నివారణతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవాలి.

7 నుంచి క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్, గోదావరిఖని, వేములవాడ, జగిత్యాలలో నిర్వహణకు కేడీసీఏ రెడీ
- ఈ నెల 6 లోపు దరఖాస్తు చేసుకున్న వారికే అవకాశం



గతేడాది శిక్షణ శిబిరంలో క్రీడాకారులు

కరీంనగర్‌స్పోర్ట్స్: క్రికెట్‌లో ఓనమాలు నేర్పించేందుకు హెచ్‌సీఏ, కేడీసీఏ శ్రీకారం చుట్టాయి. గతంలో మూడు జిల్లాల్లోనే శిబిరాలు నిర్వహించగా, ఈ ఏడాది నుంచి జగిత్యాలలో శిబిరాన్ని ప్రారంభించనున్నారు. నిష్ణాతులైన కోచ్‌ల సమక్షంలో శిక్షణ ఇవ్వనున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వి.ఆగంరావు, ఎన్.మురళీధర్‌రావు తెలిపారు. ఈనెల 7 నుంచి జూన్ 6 వరకు శిబిరాలు నిర్వహిస్తారు. ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలని క్రికెట్ సంఘం బాధ్యులు తెలిపారు.

13 నుంచి 23 ఏళ్ల వారికి..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు అనుబంధమైన కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిబిరాలు నిర్వహిస్తారు. 13 నుంచి 23 ఏళ్ల బాలబాలికలు, పురుషులకు, మహిళలకు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

దరఖాస్తు ఇలా..

క్రీడాకారులు ఫొటో, ఆధార్‌కార్డుతో సంబంధిత కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. కరీంనగర్ వావిలాలపల్లిలోని జిల్లా క్రికెట్ సంఘం కార్యాలయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు వైట్ యూనిఫాంతో రావాలి. మిగిలిన కిట్ శిబిరంలో ఇస్తారు. ఒక్కో శిబిరంలో 100 నుంచి 120 మంది క్రీడాకారులకు శిక్షణ ఇవ్వనున్నారు. ముందుగా దరఖాస్తు చేసుకునే వారికి అవకాశం దక్కుతుంది.


రాణించినవారు హెచ్‌సీఏ టోర్నమెంట్‌లో..

శిక్షణ శిబిరాల్లో రాణించిన క్రీడాకారులకు మంచి అవకాశాలు దక్కనున్నాయి. శిబిరం అనంతరం జూన్‌లో ఉమ్మడి జిల్లా క్రికెట్ టీంలను ఎంపిక చేయనున్నట్లు సమాచారం. అండర్‑14,16,19,23 విభాగాల్లో జట్లను ఎంపిక చేసి హెచ్‌సీఏ (హైదరాబాద్ క్రికెట్ సంఘం) ఆధ్వర్యంలో జరుగనున్న టోర్నమెంట్‌లకు పై జట్లను పంపించనున్నారు.

శిబిరాలు నిర్వహించే స్థలాలు

- కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎదురుగా ఉన్న క్రికెట్ అసోసియేషన్ మైదానం, సెయింట్ అల్ఫోన్స్ పాఠశాల మైదానంలో శిబిరాలు జరుగుతాయి.
  సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 86887 68775 (శ్రావణ్‌కుమార్)
- పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని జీఎం కాలనీలోని జీఎం గ్రౌండ్‌లో శిక్షణ శిబిరం జరగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 98663 51620 (కిరణ్‌కుమార్)
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని 2వ బైపాస్‌లో గల స్వర్గీయ నర్సింగరావు మైదానంలో శిబిరం జరుగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ 91772 59935 (రాజు)
- జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మినీస్టేడియం లేదా ఎస్కేఎన్‌ఆర్ కళాశాల మైదానంలో తొలిసారిగా శిక్షణ శిబిరం జరుగనుంది.
  సంప్రదించాల్సిన ఫోన్‌నంబర్ 99480 64712 (జలపతి)

క్రికెటర్లుగా ఎదిగేందుకు అవకాశం



క్రికెట్ అంటే చిన్నారులకు ఎంతో ఇష్టం. చాలా మంది పిల్లలు మైదానాలు, గల్లీలో క్రికెట్ ఆడుతంటారు. వీరందరు క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే శిబిరాల్లో పాల్గొనాలి. అత్యాధునిక పద్ధతుల్లో కోచ్లు ట్రెనింగ్ ఇస్తారు. క్రికెటర్లుగా ఎదగాలనుకునే చిన్నారులు శిబిరాల్లో శిక్షణ తీసుకుంటే చాలా బాగుంటుంది.

– వి.ఆగంరావు, క్రికెట్ సంఘం జిల్లా అధ్యక్షుడు

ఏటీఎంలో నగదు కాజేసేందుకు కుట్ర



ఏటీఎంను పరిశీలిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ఏటీఎంలో నగదు కాజేసేందుకు గుర్తు తెలియని వ్యక్తులు కుట్రపన్నారు. కరీంనగర్ టూటౌన్ పోలీసులు, ఏటీఎం నిర్వాహకుల వివరాలు.. నగరంలోని క్రిస్టియన్‌కాలనీలోని ఎస్‌బీఐ ఏటీఎంలో గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ప్రవేశించి, ఏటీఎం మిషన్ తలుపుతెరిచి, డబ్బు కాజేసేందుకు పరికరాన్ని అమర్చారు. ఉన్నతాధికారులు సీసీ ఫుటేజీ ద్వారా గమనించి, ఏటీఎం చానల్ ఎగ్జిక్యూటర్ రజినీకాంత్‌కు సమాచారమిచ్చారు. ఆయన పోలీసుల కు ఫిర్యాదు చేయగా, సీఐ సృజన్‌రెడ్డి ఏటీఎంను పరిశీలించారు. నగదు డ్రా చేసినవారి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అత్తపై కోడలు దాడి



వృద్ధురాలిని స్టేషన్‌కు తీసుకెళ్తున్న సఖి కేంద్రం నిర్వాహకులు

జగిత్యాలక్రైం: అత్తపై కోడలు కత్తితో దాడిచేయగా, కేకలు వేయడంతో స్థానికులు కాపాడి సఖి కేంద్ర నిర్వాహకులకు అప్పగించారు. స్థానికుల వివరాలు.. జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతానికి చెందిన పెండ్యాల భాగ్య సంతానం లేకపోవడంతో వినయ్ అనే వ్యక్తిని పెంచుకుంది. అతడికి అఖిల అనే యువతితో వివాహం జరిపించింది. కాగా, కొన్నేళ్లుగా అత్తను అఖిల శారీరకంగా, మానసికంగా వేధిస్తుంది. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న బోరు వేయాలని అఖిల అత్తకు సూచించగా, ఆమె మరిచిపోయింది. దీంతో ఆగ్రహించిన కోడలు ఇంట్లోని కత్తితో అత్తపై దాడిచేయగా వీపు, ముఖంపై స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు జిల్లా సంక్షేమశాఖాధికారి నరేశ్‌కు సమాచారం అందించగా, వెంటనే సఖి నిర్వాహకులు లావణ్య, సామాజిక కార్యకర్త శారద చేరదీసి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఎస్సై గీత వృద్ధురాలి కోడలు, కొడుకును పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం సఖి కేంద్ర నిర్వాహకులు వృద్ధురాలిని ఆమె ఇంటికి తరలించారు.